


# నవతరం

తెలుగు దినపత్రిక

ప్రచురణ కేంద్రం: హైదరాబాద్ , రాజమండ్రి | సంపుటి : 12 | సంచిక : 322 శుక్రవారం 3-4-2026 | పేజీలు : 4 | వెల : 5-00

### రాష్ట్రంలో 15లక్షలపైగాసిలిండర్ల

## డెలివరీ పెండింగ్

**'లాక్'తో గణనీయంగా తగ్గిన గ్యాస్ బుకింగ్‌లు**

**నెల దాటుతున్నా.. కొలిక్కి రాని సరఫరా వ్యవస్థ**

**బుకింగ్‌లోనూ వినియోగదారులకు ఇబ్బందులు**



హైదరాబాద్, ఏప్రిల్ 2నవతరం

రాష్ట్రంలో 15లక్షలపైగా సిలిండర్ల డెలివరీ పెండింగ్‌లో ఉంది. వీటి సరఫరాకు వారంపైనే పట్టే అవకాశం కనిపిస్తోంది. ఒక వైపు 'లాక్' సిస్టమ్, మరోవైపు సాఫ్ట్‌వేర్ చిక్కులతో గ్యాస్ బుకింగ్‌ల సంఖ్య భారీగా తగ్గిపోయినా... సరఫరా వ్యవస్థ మెరుగుపడకపోవడం వినియోగదారులకు చుక్కలు చూపిస్తోంది. బుక్ చేశాక.. వినియోగదారుడి ఇంటికి సిలిండర్ చేరడానికి తక్కువలో తక్కువగా రెండు నుంచి మూడు వారాలు పడుతోంది. డోర్ డెలివరీ ఆలస్యం అవుతుండటంతో వినియోగదారులు ఏజెన్సీల వద్దకు పరుగులు పెడుతున్నారు. వాస్తవానికి రాష్ట్రంలో 1.30 కోట్ల గృహ వినియోగ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. సాధారణ రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా 2.15 లక్షల రోజువారీ బుకింగ్‌లు ఉంటాయి.

మిగతా 2లో



**● అవినీతిలో విజయన్, కేసీఆర్ ఒక్కటే**
**● అమలు తీరును ప్రత్యక్షంగా చూపిస్తాం**
**● కేరళ సీఎంకు రేవంత్‌రెడ్డి ఆహ్వానం**
**● మోదీ, విజయన్ రాజకీయ అన్నదమ్ములే**
**● కేంద్రం నిధులు మోదీ కరుణ కాదు**
**● మ్యానిఫెస్టో విడుదల సందర్భంగా వ్యాఖ్యలు**

**5 గ్యారంటీలుఎలా అమలవుతాయో తెలుసుకోవాలంటే**

# తెలంగాణకు రండి



హైదరాబాద్, మార్చి 2**నవతరం** : కేరళ యూడీఎఫ్ ప్రకటించిన 5 గ్యారంటీలపై విమర్శలు చేస్తున్న వాళ్లు అవి ఎలా అమలవుతాయో తెలుసుకోవాలంటే తెలంగాణకు రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో అమలవుతున్న పథకాలను ప్రత్యక్షంగా చూసి.. తమ ట్రాక్ రికార్డు పరిశీలించుకోవచ్చన్నారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, మంత్రులు తెలంగాకు వస్తే తాము గ్యారెంటీలను ఎలా అమలు చేస్తున్నామో ప్రత్యక్షంగా చూపిస్తామంటూ ఆహ్వానించారు. కేరళలో పినరయి విజయన్ పాలన ముగిసిందని, ఇక యూడీఎఫ్ స్వర్ణయుగం మొదలు కానుందని ధీమా వ్యక్తం చేశారు. కేరళ రాష్ట్రం కొచ్చిలో గురువారం యూడీఎఫ్ ఎన్నికల మేనిఫెస్టోను సీఎం రేవంత్‌రెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని మోదీ, పినరయి విజయన్‌లను రాజకీయ సోదరులుగా పోల్చారు. ఒకరు ఢిల్లీని పాలిస్తుంటే.. మరొకరు కేరళను పాలిస్తున్నారన్నారు. దేవుడి సొంత భూమి కేరళలో దేవుడి ఆస్తికి రక్షణ లేకుండా పోయిందని శబరిమల బంగారం దారి మళ్లింపు ఘటనను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. అవినీతి, అసమర్థ, కుటుంబ పాలన విషయంలో పినరయి విజయన్, కేసీఆర్‌లకు

మిగతా 2లో



### చేనేత ఆర్డర్ల రద్దుతో

## కార్మికుల పై కక్ష

**అయిన వారి కోసం..కార్మికుల పొట్ట కొడతారా?**

**కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డ కవిత**

## పోలవరం ప్రాజెక్టు డయాఫ్రం వాల్ పూర్తి

● ఇరిగేషన్ శాఖ ఇంజనీర్లకు అభినందనలు
● ఎక్స్ వేదికగా ప్రకటించిన చంద్రబాబు



2లో

## అమరావతికి ఆమోదముద్ర

రాజ్యసభలోనూ ఏకగ్రీవం
బిల్లును రాష్ట్రపతికి పంపనున్న కేంద్రం
రాష్ట్రపతి సంతకంతో గెజిట్ విడుదల



2లో

అమరావతి,ఏప్రిల్1 నవతరం

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లుకు లోక్ సభ ఆమోదం తెలపడంతో ఏపీ ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. రాష్ట్ర ప్రజలంతా గర్వించే క్షణాలివని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ చట్టబద్ధతతో అమరావతి శాశ్వత రాజధానిగా నిలుస్తుందని.. లోక్ సభలో ఈ

మిగతా 2లో

## ఫ్యూచర్ సిటీలో పనులు పరిశీలించిన సిఎం రేవంత్



హైదరాబాద్,**నవతరం** కేరళలో ఎన్నికల ప్రచారం ముగించుకుని వచ్చిన సిఎం రేవంత్ రెడ్డి, ఫ్యూచర్ సిటీపై దృష్టి సారించారు. గరువారం అధికారులతో కలసి ఆయన ఫ్యూచర్ సిటీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఫ్యూచర్ సిటీలో ఎఫ్‌సిడిఎ కార్యాలయం, స్కిల్స్ యూనివర్సిటీ పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. సిఎం వెంట రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. కె. రామకృష్ణారావు తదితరులు ఉన్నారు.

### తెలంగాణపై బీజేపీ

# అసలు రంగు



● విభజన చట్టంపై రాజ్యసభలో అసత్యాల వల్లెవేత
● తీవ్ర అభ్యంతరం తెలిపిన బీఆర్ఎస్ సభ్యులు
● ఏడు మండలాలను ఏపీలో కలిపింది బీజేపీయే
● ఆర్డినెన్స్‌తో చట్టాన్ని సవరించింది మోదీ సర్కారే
● దాన్ని వ్యతిరేకిస్తూ నాడు బీఆర్ఎస్ అధినేత నిరసన
● తెలంగాణ బంద్‌కు సైతం పిలుపునిచ్చిన కేసీఆర్
● సభలో గుర్తుచేసిన ఎంపీలు సురేశ్‌రెడ్డి, వద్దిరాజు

హైదరాబాద్, ఏప్రిల్ 2**నవతరం** తెలంగాణపై బీజేపీ అసలు రంగు బయటపడింది. ఆ పార్టీ ఎటువైపు అన్నది ఖుల్లం ఖుల్లాగా మరోసారి తేటతెల్లమైంది. తెలంగాణపై వివక్ష మరోసారి బట్టబయలైంది. తెలంగాణ సమాజం నమ్మి ఓట్లేసి గెలిపిస్తే.. కేంద్రమంత్రయిన కిషన్‌రెడ్డి సొం తరాష్ట్రంపైనే అక్కసు వెళ్లగక్కారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను ఏపీలో విలీనం చేయడంపై పార్లమెంట్ సాక్షిగా పచ్చి అబద్ధాలు చెప్పారు. విభజన చట్టంలోనే ఆ అంశముందంటూ అసత్యాలను అంతే నిస్సిగ్గుగా వల్లెవేశారు.

## ఏప్రిల్ 24 నుంచి

## స్కూళ్లకు వేసవి సెలవులు

**అధికారికంగా ప్రభుత్వం ఉత్తర్వులు**




హైదరాబాద్,ఏప్రిల్2**నవతరం**

ఈ నెలాఖరు నుంచి స్కూళ్లకు సెలవులు ప్రారంభం కానున్నాయి. నెలాఖరులోగా సిలబస్ పూర్తి చేసి, పరీక్షలు నిర్వహించాలని విద్యాశాఖ ఇప్పటికే ఆదేశాలు ఇచ్చింది. ఎండలు దంచికొడుతున్న క్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఊరటనిచ్చే వార్త చెప్పింది. వేసవి సెలవుల షెడ్యూల్‌ను అధికారికంగా ఖరారు చేసింది. వేసవిలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకొని స్కూళ్లకు సెలవులను అధికారులు ముందుగానే

మిగతా 2లో

# 5 గ్యారంటీలుఎలా అమలవుతాయో తెలుసుకోవాలంటే తెలంగాణకు రండి

(మొదటి పేజి (తరువాయి)

దగ్గర పోలికలు ఉన్నాయని రేవంత్ అన్నారు. 2014 నుంచి దాదాపు పదేళ్ల పాటు తెలంగాణను కేసీఆర్ పాలిస్తే పదేళ్లుగా కేరళలో విజయన్ పరిపాలిస్తున్నారని చెప్పారు. 2023 ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను గద్దె దించినట్లుగానే ఈ ఎన్నికల్లో కేరళ ప్రజలు విజయన్‌ను గద్దె దింపుతారని విశ్వాసం వ్యక్తం చేశారు. "పో మోనే విజయా" డైలాగ్‌పై మీడియా అడిగిన ప్రశ్నకు రేవంత్ స్పందిస్తూ, విజయన్ తమకు రాజకీయ ప్రత్యర్థి అని, విమర్శ చేయకుండా ఎలా ఉంటామని బదులిచ్చారు. అవినీతి నియంత్రణ, పన్ను వసూళ్లలో లీకేజీలను అరికట్టడం, కేంద్ర పథకాలను వినియోగించుకోవడం, కేంద్రం నుంచి రాష్ట్రాలకు రావాల్సిన నిధులను రాబట్టుకోవడం తమ ప్రాధాన్య అంశాలని సీఎం రేవంత్ చెప్పారు. కేంద్రం రాష్ట్రాలకు ఇచ్చే నిధులు ఏమీ ప్రధాని మోదీ కరుణ చూపడంతో వచ్చేవి కావని, అవి రాష్ట్రాల ప్రజల హక్కు అని స్పష్టం చేశారు.

**తొలి క్యాబినెట్ నుంచే హామీలను అమలు**

యూడీఎఫ్ ఐదు గ్యారెంటీలు అమలు సాధ్యమా అంటున్న వారికి సమాధానం తెలంగాణ రాష్ట్రమేనని రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి క్యాబినెట్ సమావేశం నుంచే గ్యారంటీలను విజయవంతంగా అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో 25 లక్షల రైతు కుటుంబాలకు రూ.21 వేల కోట్ల మేర రుణాలను మాఫీ చేశామని తెలిపారు. సాగు చేసుకునే రైతులకు ఎకరాకు రూ.12 వేలు చొప్పున ఏడాదికి రూ.18 వేల కోట్లు రైతు భరోసా కింద అందజేస్తున్నామని చెప్పారు. తెలంగాణలో ఇప్పటికి 67,173 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, వివిధ శాఖల్లో నియామకాలు పూర్తి చేయడంతో పాటు ప్రజల సమక్షంలో ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేశామని వివరించారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు నెలకు రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు ఆదా అవుతోందన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, ఒక్కో ఇంటినిర్మాణానికి రూ.5 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నామని వెల్లడించారు. 500కే గ్యాస్ సిలిండర్ పథకాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ రైజింగ్ విజన్ డాక్యుమెంట్-2047 ప్రకారం తెలంగాణను 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపనున్నామని చెప్పారు. తెలంగాణ వృద్ధిరేటు 10.8 శాతంగా ఉందని అన్నారు.

**కేరళలోనూ మహిళలకు ఉచిత బస్సు**

కేరళలోనూ మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కార్యక్రమాన్ని కాంగ్రెస్ తన గ్యారెంటీల్లో చేర్చింది. కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యూడీఎఫ్ కేరళ ఎన్నికల సందర్భంగా ఐదు గ్యారెంటీలు ప్రకటించగా అందులో మొదటి గ్యారెంటీగా కేఎస్ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని చేర్చింది. రెండో గ్యారెంటీగా కాలేజీల్లో విద్యను అభ్యసిస్తున్న బాలికలకు నెలకు రూ.1,000 ఆర్థిక సహాయం, మూడో గ్యారెంటీగా సంక్షేమ పింఛన్లు నెలకు రూ.3 వేలకు పెంపు, నాలుగో గ్యారెంటీగా మాజీ సీఎం ఉమెన్ చాందీ పేరుతో ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమా, ఐదో గ్యారెంటీగా యువతకు స్వయం ఉపాధి కోసం రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు పేర్కొంది. వీటితో పాటుగా సముద్ర, విమానయాన రంగాలకు సంబంధించి ఐదు డ్రీమ్ ప్రాజెక్టులు, వయనాడ్‌లో గిరిజన వర్సిటీ ఏర్పాటు వాగ్దానాలు ఉన్నాయి.

## ఆర్టీపీపీలో రికార్డు స్థాయి విద్యుత్ ఉత్పత్తి

మంత్రి గొట్టిపాటి రవి కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీపీపీ ఇంజనీర్లను, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ప్లాంట్ చరిత్రలో తొలిసారిగా 99.58 శాతం ప్లాంట్ లోడింగ్ ఫ్యాక్టర్ నమోదు చేయడం ఏపీ జెన్కో సాధించిన ఘన విజయమని మంత్రి గొట్టిపాటి కొనియాడారు. సీఎం ఆశయ సాధన దిశగా అహర్నిశలు శ్రమిస్తున్న జెన్కో ఇంజనీర్ల అంకితభావం వల్లే ఈ రికార్డు సాధ్యమైందని మంత్రి స్పష్టం చేశారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కేవలం విద్యుత్ ఉత్పత్తిలోనే కాకుండా, వినియోగదారులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యుత్ అందించేందుకు డిస్కంలు, ట్రాన్స్ కో ఇంజనీర్లు కూడా సమిష్టిగా పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

## శనగ కొనుగోళ్ల పెంపుపై ప్రత్యేక చొరవ

అమరావతి,రాష్ట్రంలో శనగ ఉత్పత్తి భారీగా పెరగడంతో రైతులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రత్యేక చొరవ చూపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అనుమతించిన కొనుగోలు పరిమితి సరిపోదని గుర్తించిన మంత్రి, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి అచ్చెన్నాయుడు సూచన మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. ఇప్పటికే రాష్ట్రంలో ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా 72 వేల మెట్రిక్ టన్నులు, నాఫెడ్ ద్వారా 12 వేల మెట్రిక్ టన్నుల శనగ కొనుగోలు చేశారు. మొత్తం 84 వేల మెట్రిక్ టన్నుల కొనుగోలు పూర్తవడంతో ప్రస్తుతం ఉన్న లక్ష్యం త్వరలోనే పూర్తయ్యే అవకాశం ఉంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ తాజా అంచనాల ప్రకారం ఈ ఏడాది శనగ సాగు విస్తీర్ణం 3,88,413 హెక్టార్లకు పెరిగింది. ఉత్పత్తి కూడా 4,57,365 మెట్రిక్ టన్నులకు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రానికి 94,500 మెట్రిక్ టన్నుల శనగ కొనుగోలు లక్ష్యం మాత్రమే ఉన్నప్పటికీ, పెరిగిన ఉత్పత్తి దృష్ట్యా దానిని 4,57,365 మెట్రిక్ టన్నులకు పెంచాలని కేంద్రాన్ని కోరారు. ప్రస్తుతం మార్కెట్లో శనగ ధర కనీస మద్దతు ధర కంటే తక్కువగా ఉండటంతో రైతులు తమ మొత్తం ఉత్పత్తిని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని, పెరిగిన ఉత్పత్తికి అనుగుణంగా శనగ కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది.

## పోలవరం రాష్ట్ర ప్రజలకు వరప్రదాయిని

వాల్ నిర్మాణాన్ని 440 రోజుల్లో పూర్తి చేశామన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో 18 నెలలు శ్రమించి నిర్మించిన డయాఫ్రం వాల్‌ను గత జగన్ ప్రభుత్వం విధ్వంసం చేసిందని గుర్తు చేశారు. జగన్ విధ్వంసానికి కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణానికి అదనంగా మరో రూ.1000 కోట్లు ఖర్చు అయిందని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. 2025 జనవరి 18వ తేదీన ఈ డయాఫ్రం వాల్ నిర్మాణ పనులు ప్రారంభించి.. ఈ రోజు పూర్తి చేశామని వివరించారు. 2020 ఆగస్టులో వచ్చిన వరదలకు డయాఫ్రం వాల్ దెబ్బతింటే, 2021 జూన్, అదే ఏడాది డిసెంబర్, 2022 జూన్‌లో దీనిని పూర్తి చేస్తామని వైఎస్ జగన్ అసెంబ్లీలో చేసిన ప్రకటనలను ఈ సందర్భంగా మంత్రి ప్రస్తావించారు. ప్రాజెక్టుకు డయాఫ్రం వాల్ ఉందో లేదో తెలియని స్థితిలో నాటి ముఖ్యమంత్రి జగన్ ఉన్నారని వ్యంగ్యంగా అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విధ్వంసమైన పోలవరం ప్రాజెక్టు పనులను సీఎం చంద్రబాబు గాడిలో పెట్టారని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు. ప్రాజెక్టు డయాఫ్రం వాల్ పూర్తి కావడంతో.. ఈ నిర్మాణంలో భాగమైన ఇంజనీర్లు, సిబ్బందిని మంత్రి నిమ్మల రామానాయుడు సన్మానించి.. వారికి స్వీట్లు తినిపించారు.

### ఫ్యూచర్ సిటీలో పనులు పరిశీలించిన సిఎం రేవంత్

హైదరాబాద్,ఏప్రిల్2 కేరళలో ఎన్నికల ప్రచారం ముగించుకుని వచ్చిన సిఎం రేవంత్ రెడ్డి, ఫ్యూచర్ సిటీపై దృష్టి సారించారు. గురువారం అధికారులతో కలిసి ఆయన ఫ్యూచర్ సిటీ ప్రాంతాన్ని పరిశీలించారు.

ఫ్యూచర్ సిటీలో ఎఫ్‌సిడిఎ కార్యాలయం, స్కిల్స్ యూనివర్సిటీ పనులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. సిఎం వెంట రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. కె. రామకృష్ణారావు తదితరులు ఉన్నారు.

## రాష్ట్రంలో 15లక్షలపైగా సిలిండర్ల డెలివరీ పెండింగ్

(మొదటి పేజి (తరువాయి)

రోజుకు ఐఓసీఎల్ 93 వేలు, హెచ్‌పీసీఎల్ 75 వేలు, బీపీసీఎల్ 47 వేల చొప్పున గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తుంటాయి. యుద్ధం ప్రారంభం కాకముందు సాధారణ రోజుల్లో రాష్ట్రంలో రోజూ వారీగా 3.50 లక్షల పెండింగ్ బిల్లులు(బుకింగ్) ఉండేవి. అందులో 2.15 లక్షల సిలిండర్లు సరఫరా చేసేవారు. మిగిలినవి మరుసటి రోజున డెలివరీ చేసేవారు. కానీ, ఇప్పుడు పెండింగ్ బుకింగ్‌ల సంఖ్య 15 లక్షలకు పెరిగింది. అంటే ఇవి డెలివరీ కావడానికి 7-8 రోజుల సమయం పడుతుంది. ఆలోపు కొత్త బుకింగ్‌ల సంఖ్య కూడా పెరుగుతూ ఉంటుంది. గత వారం రాష్ట్ర పౌర సరఫరాలశాఖ కమిషనర్ సమీక్ష చేసేనాటికి 17 లక్షల పెండింగ్ బుకింగ్‌లు ఉన్నాయి. వారం రోజుల్లో 2 లక్షలు తగ్గాయి. ఇప్పటికీ 15 లక్షలు పెండింగ్ ఉన్నాయి. సిలిండర్ల డెలివరీ వేగవంతం చేస్తే ఈ సంఖ్య కాస్త తగ్గుతుంది. వాస్తవానికి యుద్ధం ప్రభావంతో తొలి వారం, పది రోజులు చాలా ఇబ్బందులు ఎదురయ్యాయి. అప్పుడే ఆందోళనతో బుకింగ్‌లు ఎక్కువ అయ్యాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం 'సిస్టమ్ లాక్' పద్ధతిని అమలులోకి తీసుకొచ్చింది. రీఫిల్ నుంచి రీఫిల్ బుకింగ్ మధ్య గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజులు, పట్టణ ప్రాంతాల్లో సింగిల్ సిలిండర్ ఉంటే... 25 రోజులు, డబుల్ సిలిండర్లు ఉన్నవారికి 35 రోజుల లాక్ పెట్టింది. ఈ లాక్ టైమ్ అయిపోయిన తర్వాతే మళ్లీ సిలిండర్ బుక్ అయ్యేలా సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసింది. గతంలో ఈ రోజు ఒక సిలిండర్ బుక్‌చేసి... మళ్లీ రేపు ఒక సిలిండర్ బుక్ చేస్తే సాఫ్ట్‌వేర్ తీసుకునేది. ఇప్పుడు అలా తీసుకోవడం లేదు.

## తెలంగాణపై బీజేపీ అసలు రంగు

దీంతో కేంద్రమంత్రి వ్యా ఖ్యలపై బీఆర్ఎస్ రాజ్యసభ సభ్యు లు నిప్పులు చెరిగారు. తీవ్ర అ భ్యంతరం వ్యక్తం చేస్తూ వాగ్వాదానికి దిగారు. వ్యాఖ్యలను వెంటనే వెనకి తీసుకోవాలని, లేదంటే, సభా హాకుల ఉల్లంఘ న తీర్మానాన్ని ప్రవేశపెడతామని హెచ్చరించారు. దీంతో పెద్దలసభలో గురువారం ఒకసారిగా ఉద్రిక్తత ఏర్పడింది.తెలంగాణ పర్యాటకం

00:00/01:10

రాజ్యసభలో కిషన్‌రెడ్డి వితండవాదం

సురేశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. బీజేపీ ప్రభుత్వ పెద్దల తరహాలోనే అసత్య ఆరోపణలకు దిగారు. భద్రాచలంలోని గ్రామాలను ఏపీలో కలపాలనే ప్రతిపాదనను ఆనాటి కాంగ్రెస్ సర్కారే విభజన బిల్లులో పొందుపరిచిందంటూ పార్లమెంట్ సాక్షిగా పచ్చి అబద్ధాలు పలికారు. ఆ రోజు సోనియాగాంధీని ఎందుకు ప్రశ్నించలేదంటూ వితండవాదం చేశారు. వాస్తవంగా ఏడు మండలాల విలీనం అంశం పునర్విభజన చట్టంలోనే లేదు. రాష్ట్ర ఏర్పాటు అనంతరం, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక తెలంగాణలోని ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసింది. ఆ మేరకు పునర్విభజన చట్టాన్ని సవరించింది.జ ఈ ఎ హాశీఘ్రీ ఈ చర్యను నాడు బీఆర్ఎస్ అధినేత తీవ్రంగా వ్యతిరేకించారు. అంతేకాదు యావత్ తెలంగాణ బంద్‌కు సైతం పిలుపునిచ్చారు. బీజేపీ విద్రోహచర్యను ఎండగడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఇక ఏపీ సీఎం చంద్రబాబు.. ఆ ఏడు మండలాలను కలిపితే కానీ ప్రమాణ స్వీకారం చేయబోనని ప్రధాని మోదీని హెచ్చరించి, సాధించానని అనేకసార్లు పత్రికాముఖంగా, బహిరంగ సభావేదికలపై నుంచి ప్రకటించారు. ఇప్పటికీ ఆ విషయాన్ని చెప్తూనే ఉన్నారు. కానీ కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాత్రం ఏడు మండలాల విలీనం అంశం విభజన చట్టంలోనే ఉందంటూ పార్లమెంట్ వేదికగా పచ్చి అబద్ధాలు చెప్పారు.

కాళేశ్వరం ప్రాజెక్టుపైనా ఆయన అసంబద్ధ వ్యాఖ్యలు చేశారు. అసత్య ప్రచారాలకు పూనుకున్నారు. కిషన్‌రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ సభ్యుడు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఘాటుగా స్పందించారు. తెలంగాణను సాధించిన, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలబెట్టిన మాజీ సీఎం కేసీఆర్‌పై మంత్రి కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కిషన్‌రెడ్డి వర్సెస్

బీఆర్ఎస్ అన్నట్లుగా సభ మారిపోయింది. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో బీఆర్ఎస్ సభ్యులు వాగ్వాదానికి దిగారు. కిషన్‌రెడ్డి వ్యాఖ్యలకు బీఆర్ఎస్ ఎంపీలు దీటుగా బదులిచ్చారు. అదే సమయంలో కేంద్రం వైఖరిని సైతం ఎండగట్టారు. వ్యాఖ్యలను వెనక్కితీసుకోవాలని పట్టుబట్టారు. ఈ క్రమంలో రాజ్యసభలో కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొన్నది.

# అమరావతికి ఆమోదముద్ర

న్యూఢిల్లీ,ఏప్రిల్2:ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి చట్టబద్ధత బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపింది. ఈ అమరావతి బిల్లుకు ఉభయ సభలు ఏకగ్రీవ ఆమోదం తెలిపాయి. అనంతరం ఈ బిల్లును కేంద్రం.. రాష్ట్రపతికి పంపనుంది. ఈ బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం చేసిన తర్వాత గెజిట్ నోటిఫికేషన్ విడుదలకానుంది. దీంతో ఏపీ ఏకైక రాజధానిగా అమరావతి అమల్లోకి రానుంది. ఈ బిల్లు రాజ్యసభలో గురువారం ఆమోదం పొందడంతో.. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు రాజ్యసభ ఛైర్మన్ సి.పి.రాధాకృష్ణన్ శుభాకాంక్షలు తెలియజేశారు. మొత్తంగా ఏపి రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. 'ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్ట సవరణ బిల్లు'కు రాజ్యసభ ఆమోదం తెలిపింది. మూజువాణీ ఓటుతో ఈ బిల్లు ఆమోదం పొందగా, ఇప్పటికే లోక్‌సభలోనూ ఈ బిల్లుకు ఆమోదం లభించిన విషయం తెలిసిందే. దీంతో పార్లమెంట్ ఉభయసభల ఆమోదం పొందిన ఈ బిల్లు రాష్ట్రపతి ఆమోదానికి పంపబడనుంది. రాష్ట్రపతి సంతకం అనంతరం అమరావతి ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అధికారికంగా చట్టబద్ధత పొందనుంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లో కీలక మలుపుగా భావిస్తున్నారు. ముఖ్యంగా రాజధాని విషయంలో ఉన్న అనిశ్చితి తొలగిపోవడం పట్ల ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.రాజ్యసభలో ఈ బిల్లుపై జరిగిన చర్చ అనంతరం కేంద్ర హోమ్ శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ సమాధానం ఇచ్చారు. ఏపీ రాజధాని అంశంపై ఉన్న అస్పష్టత పూర్తిగా తొలగిపోయిందని తెలిపారు

## చేనేత ఆర్డర్ల రద్దుతో కార్మికులపై కక్ష

హైదరాబాద్,ఏప్రిల్2 కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కార్మికుల పొట్టకొడుతోందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. చేనేత కార్మికులకు ఇచ్చిన విద్యార్థుల యూనిఫాంల ఆర్డర్‌ను ఏకపక్షంగా రద్దు చేయడంపై కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాల్సిన వారికి మేలు చేసేందుకే కార్మికులకు అన్యాయం చేస్తున్నారంటూ తీవ్ర ఆరోపణలు గుప్పించారు. ఏటా సుమారు రూ.105 కోట్ల యూనిఫాంల ఆర్డర్ ఇచ్చేవారని.. ఇప్పుడు దాని రద్దుతో నేతన్నలు మరింత ఉపాధి కోల్పోయారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత ఉపాధి సంక్షోభంలో పడిందని కవిత ధ్వజమెత్తారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని 393 చేనేత సహకార సంఘాలపై తీవ్ర ప్రభావం చూపనుందని.. కార్మికులు వీధిన పడే దుస్థితి వచ్చిందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ శాఖలకు చెందిన దుప్పట్లు, దుస్తులకు సంబంధించి రూ.200 కోట్ల ఆర్డర్లను కూడా తెలంగాణ చేనేతలకు ఇవ్వలేదని ఆరోపణలు గుప్పించారు. ÷స్కూలు ఆర్డర్లు ఇవ్వకుండా సంఘాల నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేట్ వ్యక్తులకు లాభం చేకూర్చేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని రేవంత్ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు కవిత. ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే కార్మికులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు కల్వకుంట్ల కవిత.

# సంపులో పడి చిన్నారి మృతి

హైదరాబాద్,ఏప్రిల్2 :నార్సింగిలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. గండిపేటలో ఎనిమిది నెలల పసికందు సంపులో పడి మృతి చెందింది. ఆడుకుంటూ ఇంటి బయటికి వచ్చిన చిన్నారి ప్రమాదవశాత్తు సంపులో పడిపోయింది. వెంటనే గమనించిన తల్లిదండ్రులు సంపు దగ్గరకు వెళ్లేలోపే నీటిలో మునిగిపోయింది. సంపులో నుంచి చిన్నారిని బయటకు తీసిన తల్లిదండ్రులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీగా విలపించారు. పొట్ట చేత పట్టుకుని మహారాష్ట్ర నుంచి హైదరాబాద్‌కు వచ్చిన చిన్నారి తల్లిదండ్రులు.. గండిపేటలో జీవనం సాగిస్తున్నారు. అప్పటి వరకు ఆడుకుంటున్న తమ చిన్నారి ఇలా విగతజీవిగా మారడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ విషాద ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.

## కాంగ్రెస్ నేత కాటా అరెస్ట్

సంగారెడ్డి,ఏప్రిల్2 ఆరోస్ పురంలోని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కాటా శ్రీనివాస్ గౌడ్ ఇంటి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డిపై కాటా శ్రీనివాస్ అవినీతి ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఎమ్మెల్యేపై చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉంటానని.. తడి బట్టలతో గుడిలో ప్రమాణం చేస్తానని కాంగ్రెస్ నేత తెలిపారు. అందులో భాగంగా గురువారం ఉదయం బీరంగూడ శివాలయం వద్ద ప్రమాణం చేయడానికి వాహనంలో బయలుదేరారు కాటా శ్రీనివాస్. ఇంటి బయటే పోలీసులు ఆయన వాహనాన్ని అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. శివాలయం వద్దకు వెళ్లే తీరుతానని కాటా శ్రీనివాస్ పట్టుబట్టారు. దీంతో పోలీసులు, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. తన కుటుంబ సభ్యులను గుడికి అనుమతించాలని పోలీసులను శ్రీనివాస్ కోరారు. చివరకు కాటా శ్రీనివాస్ గౌడ్‌ను అరెస్ట్ చేసిన పోలీసులు హైదరాబాద్ వైపు తరలించారు.

## ఏప్రిల్ 24 నుంచి స్కూళ్లకు వేసవి సెలవులు



ప్రకటించారు. విద్యాశాఖ తాజా ప్రకటన ప్రకారం.. తెలంగాణలోని స్కూళ్లకు ఈ ఏడాది ఏకంగా 48 రోజుల పాటు వేసవి సెలవులు ఉండనున్నాయి. ఏప్రిల్ 24వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు ఈ సెలవులు అమల్లో ఉంటాయి. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశా లలకు ఈ నిబంధన వర్తిస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. సుదీర్ఘ వేసవి సెలవుల అనంతరం జూన్ 12న తిరిగి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. సెలవులు ప్రారంభమయ్యే లోపు సిలబస్ పూర్తి అయ్యేలా చూడాలని ప్రభుత్వం పాఠశాలల యాజమాన్యాలకు సూచించింది. అవసరమైతే విద్యార్థులకు ఎలాంటి అంతరాయం లేకుండా వారానికి ఒకసారి అదనపు తరగతులు నిర్వహించవచ్చని తెలిపింది.

# ప్రైవేటీకరణ కుట్రల నుంచి బటయపడని స్టీల్ ప్లాంట్

## నగరంలో సిఐటియు ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నిరసన

విశాఖపట్టణం,ఏప్రిల్2 ప్రభుత్వ రంగంలోని, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కపట ప్రేమ చూపిస్తున్నాయని, ప్రైవేట్ రంగం పట్ల ప్రేమ చూపిస్తూ, ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నాయని విశాఖ ఉక్కు పరిరక్షణ కార్మిక,ప్రజా సంఘాల జెఎసి చైర్మన్ ఎం.జగ్గు నాయుడు, ఎఐటియుసి జాతీయ ఉపాధ్యక్షులు డి. ఆదినారాయణ, ఐఎన్ టియుసి రాష్ట్ర అధ్యక్షులు మంత్రి రాజశేఖర్ ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలంటూ, జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్ష శిబిరం ఏర్పాటు చేసి 5 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా జెఎసి ఆధ్వర్యంలో విశాఖ నగరంలో కార్మిక ప్రజా సంఘాలు వందలాది మందితో ర్యాలీ నిర్వహించారు. డిఆర్ఎం కార్యాలయం నుండి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు లేవన్నారు. జి ఎస్ టి రాయితీలు లేవన్నారు. వాటర్ రాయితీ లేదన్నారు. స్టీల్ ప్లాంట్ లో తొమ్మిది వేల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, స్టీల్ ప్లాంట్ పై సుమారు రెండు లక్షల మంది ఆధారపడి జీవిస్తున్నారని చెప్పారు. అనేక దశాబ్దాల పాటు లాభాలలో నడిచిన స్టీల్‌ను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఐదేళ్ల క్రితం నిర్ణయించిందన్నారు. కేంద్ర నిర్ణయాన్ని



వ్యతిరేకిస్తూ, విశాఖ నగరంలోనూ, రాష్ట్రంలోనూ, కార్మికులు ప్రజలు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నారని చెప్పారు. ఇదే సందర్భంలో అనకాపల్లి జిల్లాలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న ఆర్ సి ఎల్ మెటల్ స్టీల్ ప్లాంట్ కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రా మెటీరియల్ గ్యారెంటీ ఇచ్చాయన్నారు. ల్యాండ్ రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ చెల్లించిన అవసరం లేదన్నారు. 10 సంవత్సరాల వరకు వాటర్ పై పన్ను లేదన్నారు. 15 సంవత్సరాల పాటు పూర్తి రాయితీ ఎలక్ట్రిసిటీ కల్పిస్తున్నారు. 2.9 కిలోమీటర్ల వరకు క్యాపిటల్ పోర్టు నిర్మాణానికి అనుమతి ఇచ్చారన్నారు. ప్రైవేటు మిట్టల్ పై ఉన్న ప్రేమ, ప్రభుత్వ రంగం విశాఖ స్టీల్ ప్లాంట్ పై ఎందుకు లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఖరి మార్చుకొని, విశాఖ స్టీల్ ప్లాంట్ ను రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఎఫ్ టియు జాతీయ అధ్యక్షుడు ఎన్. కనకరావు, సిపిఎం మాజీ ఫ్లోర్ లీడర్ బి.గంగా రావు, సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ కె ఎస్ వి కుమార్, అధ్యక్షులు కె.ఎం శ్రీనివాస్,ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఎస్.జె అచ్యుత్ రావు, రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ,స్టీల్ ఎ÷-లాంట్ సిఐటియు యూనియన్ నాయకులు అయోధ్య రామ్,ఎన్.రామస్వామి,ఐఎన్ టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బి. నాగభూషణం,ఐఎఫ్ టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు,వైఎస్ఆర్ టియుసి యూనియన్ నాయకులు, మాజీ కార్పొరేటర్ పి.వి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# బసిరెడ్డిపల్లిలో తీవ్ర విషాదం

**ఐదేళ్ల చిన్నారి దారుణ హత్య - చంపి చెరువు కట్టపై పడేసిన దుర్మార్గులు**



నారాయణపేట,ఏప్రిల్2 జిల్లాలోని బసిరెడ్డిపల్లిలో తీవ్ర విషాదం నెలకొంది. కేవలం ఐదు సంవత్సరాల వయసున్న చిన్నారి తేజశ్రీని గుర్తు తెలియని దుండగులు అత్యంత దారుణంగా హత్య చేశారు. డెడ్ బాడీని చెరువు కట్టపై పడేశారు. ఈ ఘటనతో ఒక్కసారిగా గ్రామంలో కలకలం రేగింది. చిన్నారి డెడ్ బాడీని చూసి తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. నారాయణపేట జిల్లా బసిరెడ్డిపల్లికి చెందిన అంజి, శిరీష దంపతులకు ఇద్దరు సంతానం. ఒక పాప, ఒక బాబు ఉన్నారు. తల్లిదండ్రులు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో ఉంటున్నారు. వారి వెంట బాబును తీసుకెళ్లారు. ఐతే కూతుర్ని మాత్రం వారి తల్లిదండ్రుల దగ్గర ఉంచేశారు. దాంతో అవ్వా తాత.. చిన్నారి తేజశ్రీని జాగ్రత్తగా చూసుకుంటున్నారు. మరోవైపు చిన్నారి తేజశ్రీ కూడా అవ్వా, తాత దగ్గర బాగానే పెరుగుతోంది. రోజూ అంగన్‌వాడీకి వెళ్లడం.. తర్వాత తోటి పిల్లలతో ఆడుకుంటూ ఉండేది. అంతా బాగుంది అనుకున్న తరుణంలో గ్రామంలో ఒక్కసారిగా కలకలం రేగింది. ఎండాకాలం కావడంతో గ్రామాల్లో ఆరుబయట నిద్రించడం ఆనవాయితీ. రాత్రి అవ్వ తాతతో కలిసి తేజశ్రీ బయట నిద్రించింది. కానీ అర్ధరాత్రి సమయంలో అమ్మాయి వారి పక్కలో లేకపోవడంతో వృద్ధ దంపతులు కంగారు పడ్డారు. గ్రామస్థుల సహాయంతో గ్రామంలో వెతుకగా చెరువు కట్టపై చిన్నారి విగతజీవిగా పడి ఉంది. అది చూసిన

# బినామీలతో వంచన..

# ఏజెన్సీ చట్టాలకు తూట్లు

- గిరిజనుల ముసుగులో గిరిజనేతరుల 'వ్యాపార' సామ్రాజ్యం
- 1/70 చట్టం సాక్షిగా 'బినామీ' బాగోతం.. అధికారులు నిమ్మకు నీరెత్తినట్లేనా?
- గిరిజనుల పేర్లను వాడుకుంటూ పెట్రోల్ బంకులు,రైస్
- మిల్లులు,కళ్యాణ మండపాలు నిర్మిస్తూ ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కుతున్న వైనం
- రైస్ మిల్లు,, ఒకరి పేరు- మరొకరి హోరు
- గ్రామపంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- నాన్ అగ్రికల్చర్ కన్వర్షన్ జరిగిందా లేదా?

**నవతరం ప్రతినిధి: ఖమ్మం భద్రాద్రి జిల్లా**




రాజ్యాంగం కల్పించిన రక్షణ కవచం.. గిరిజనుల భూములకు భరోసా ఇచ్చే 1/70 చట్టం వినాయకపురం ఏజెన్సీ ప్రాంతంలో అపహాస్యానికి గురవుతోంది. గిరిజన ప్రాంతాల్లో భూమి క్రయవిక్రయాలు, వాణిజ్య కార్యకలాపాలపై కఠినమైన ఆంక్షలు ఉన్నప్పటికీ, కొందరు గిరిజనేతరులు 'బినామీ'ల ముసుగులో కోట్లాది రూపాయల వ్యాపారాలు సాగిస్తున్నారు. స్థానిక గిరిజనుల పేర్లను వాడుకుంటూ పెట్రోల్ బంకులు, రైస్ మిల్లులు, కళ్యాణ మండపాలు నిర్మిస్తూ ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కుతున్నారు.

**బినామీల చేతుల్లో 'నల్ల బంగారం' (పెట్రోల్ బంకులు):**







వినాయకపురం మండల కేంద్రంలో నడుస్తున్న రెండు పెట్రోల్ బంకులు చట్టపరంగా గిరిజనులకు కేటాయించినవి కావాలి. కానీ, క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే కథ వేరేలా ఉంది. కేవలం రికార్డుల్లో మాత్రమే గిరిజనుల పేర్లు కనిపిస్తున్నాయి. అసలు పెట్టుబడి, నిర్వహణ, లాభాలు అంతా గిరిజనేతరుల చేతుల్లోనే ఉండటం గమనార్హం. ఏజెన్సీ భూముల్లో వ్యాపార అనుమతులు పొందేందుకు అమాయక గిరిజనులను పావులుగా వాడుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**రైస్ మిల్లు.. ఒకరి పేరు - మరొకరి హోరు:**

ఏళ్ళ తరబడి నడుస్తున్న ఒక రైస్ మిల్లు వ్యవహారం కూడా ఇలాగే ఉంది. ఏజెన్సీ నిబంధనల ప్రకారం గిరిజనేతరులు అక్కడ పరిశ్రమలు నెలకొల్పకూడదు. కానీ, ఒక గిరిజనుడి పేరు మీద లైసెన్స్ తీసుకుని, తెర వెనుక గిరిజనేతరులు చక్రం తిప్పుతున్నారు. పదుల సంఖ్యలో వెలుస్తున్న జీ౦1, జీ౦2, జీ౦3 కట్టడాలు కూడా ఎటువంటి అనుమతులతో నిర్మిస్తున్నారో అధికారులకే తెలియాలి.

**మున్సిపల్/పంచాయతీ అనుమతులు ఎలా?:**

సొంత స్థలమైనప్పటికీ ఏజెన్సీ ప్రాంతంలో భారీ కన్స్ట్రక్షన్లు చేపట్టాలంటే ఐటీడీఏ మరియు రెవెన్యూ విభాగాల నుంచి ప్రత్యేక అనుమతులు అవసరం. నివాస యోగ్యం కాని రీతిలో, వ్యాపార లాభాల కోసం అడ్డగోలుగా నిర్మిస్తున్న ఈ భవనాలపై గ్రామ పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడం వెనుక పెద్దల హస్తం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**గిరిజనుల డిమాండ్:**

1/70 చట్టం అమలును పర్యవేక్షించాల్సిన రెవెన్యూ యంత్రాంగం నిద్రపోతోందా?


బినామీ పేర్లతో నడుస్తున్న పెట్రోల్ బంకులు, రైస్ మిల్లులపై విచారణ జరిపే దమ్ముందా?

గిరిజనుల హక్కులను కాలరాస్తున్న ఈ అక్రమ కట్టడాలను కూల్చివేసే ధైర్యం అధికారులకు ఉందా?

ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకే సకల అధికారాలు ఉండాలని చట్టం చెబుతుంటే, వినాయకపురంలో మాత్రం గిరిజనేతరుల పెత్తనం సాగుతోంది. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి ఈ 'బినామీ' సామ్రాజ్యాలపై సమగ్ర విచారణ జరిపించాలని బాధితులు, గిరిజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గతంలో ఈ కట్టడాలు నిర్మించక ముందు అవి అగ్రికల్చరల్ భూములుగా ఉండేవి. అయితే నాన్ అగ్రికల్చర్ కన్వర్షన్ జరిగిందా లేదా? అనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఇదంతా ఒక ఎత్తైతే ప్రస్తుతం జి ప్లస్ టు భారీ వ్యాపార భవనాల నిర్మాణం కొత్తగా జరుగుతుండడంతో


**పంచాయతీ కార్యదర్శి వివరణ**

పంచాయతీ కార్యదర్శినీ చరవాణి ద్వారా వివరణ కోరగా ఇలాంటి కన్స్ట్రక్షన్ కు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, అయినా సొంత స్థలాల్లో కట్టుకుంటే బ్లూ ప్రింట్ లేకపోయినా, కన్స్ట్రక్షన్ అథారిటీ అనుమతులు లేకపోయినా,టౌన్ ప్లానింగ్ రిపోర్టు లేకపోయినా ఆలస్యంగా వచ్చి క్రమబద్ధీకరించమన్నా ఎక్కువ ఫీజు వసూలు చేసి పంచాయతీ నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరిస్తామని చెప్పటం గమనార్హం. వినాయకపురం మెయిన్ రోడ్ లో మరికొన్ని భారీ కన్స్ట్రక్షన్స్ జరుగుతుంటే వాటిని మీరు పట్టించుకోవడం లేదా అని అడిగితే అవి ప్రభుత్వ స్థలాల్లో కడుతున్నట్లయితే జోక్యం చేసుకోవడం జరుగుతుంది. అని చెప్పిన సమాధానం చట్టం తన చుట్టం అన్నట్లు ఆయన తీరు కనిపిస్తోంది. కన్స్ట్రక్షన్ నడుస్తున్న పట్టించుకోని మీకు అది సొంత స్థలము ప్రభుత్వం తెలియనప్పుడు కన్స్ట్రక్షన్ జరిగిపోతే అక్రమ కట్టడాన్ని కూల్చే దమ్ము ఒక అధికారిగా మీకు ఉందా? అని అడిగితే మీకు కూల్చడం కావాలా,? దమ్ము గురించి మాట్లాడితే నేను ఎంతకైనా తెగిస్తాను అని


















వ్యక్తిగత దూషణకు దిగజారటం,ప్రభుత్వ నిబంధనలను అమలు చేయాల్సిన ఒక బాధ్యతాయుతమైన అధికారి అక్రమాలను ప్రశ్నించిన జర్నలిస్టుపై అహంకారంత...

# డెకాయిట్ మూవీపై ప్రేక్షకుల్లో ఆసక్తి

## అడవి శేష్‌కు జోడీగా మృణాల్ ఠాకూర్




టాలీవుడ్ యంగ్ హీరో అడివి శేష్ నటిస్తున్న తాజా చిత్రం 'డెకాయిట్' ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తిస్తోంది. షనీల్ డియో దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా రివెంజ్ డ్రామా, రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ మేళవింపుగా రూపొందుతోంది. కథ, ట్రీట్‌మెంట్ పరంగా కొత్తదనం చూపించే ప్రయత్నం చేస్తున్నట్లు చిత్రబృందం చెబుతోంది. ఈ చిత్రంలో శేష్‌కు జోడీగా మృణాల్ ఠాకూర్ నటించడం మరో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, గ్లింప్స్ సినిమాపై మంచి బజ్‌ను సృష్టించాయి. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఇక తాజాగా సినిమా ప్రమోషన్లలో భాగంగా అడివి శేష్ అభిమానులతో సోషల్ మీడియా ద్వారా ముచ్చటిస్తూ కీలక ప్రకటన చేశాడు. ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 'డెకాయిట్' ట్రైలర్‌ను ఏప్రిల్ 4న విడుదల చేయనున్నట్లు ప్రకటించాడు. ఈ ట్రైలర్‌తో సినిమాపై ఉన్న అంచనాలు మరింత పెరుగుతాయని మేకర్స్ ధీమాగా ఉన్నారు. ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తుండగా, సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. భారీ నిర్మాణ విలువలతో ఈ ప్రాజెక్ట్ రూపొందుతోంది. తెలుగుతో పాటు హిందీలో కూడా ఈ సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఇక ఈ సినిమాలో ప్రముఖ నటుడు ప్రకాశ్ రాజ్, బాలీవుడ్ దర్శకుడు-నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రల్లో కనిపించనుండటం విశేషం. వారి పాత్రలు కథకు బలాన్ని అందించనున్నాయని టాక్ వినిపిస్తోంది. సంగీతాన్ని భీమ్స్ సిసిరోలియో అందిస్తుండగా, టెక్నికల్‌గా కూడా సినిమా ఉన్నత స్థాయిలో ఉండబోతోందని చిత్ర యూనిట్ చెబుతోంది. అడివి శేష్ తన కెరీర్‌లో ఎప్పుడూ కంటెంట్ ఆధారిత సినిమాలతోనే గుర్తింపు పొందాడు. ఇప్పుడు 'డెకాయిట్'తో మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకుంటాడా అన్న ఆసక్తి నెలకొంది. మొత్తానికి ట్రైలర్ రిలీజ్‌తో 'డెకాయిట్'పై ఉన్న హైప్ మరింత పెరగడం ఖాయం.

# వారణాసిలో రాముడు ఎలా ఉంటాడో?





దర్శకధీరుడు రాజమౌళి ప్రస్తుతం టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబుతో 'వారణాసి' అనే భారీ ప్రాజెక్ట్ చేస్తున్నారు. గ్లోబల్ అడ్వెంచర్‌గా వస్తున్న ఈ సినిమా హాలీవుడ్ స్థాయికి ఏ మాత్రం తగ్గకుండా.. దాదాపు వెయ్యి కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతోంది. ఈ సినిమాను రామాయణాన్ని టచ్ చేస్తూ ఊహకందని విధంగా.. విజువల్ వండర్‌గా రూపొందిస్తున్నాడు రాజమౌళి. దీంతో మహేష్ బాబు రాముడి లుక్ ఎలా ఉంటుందా? అని అంతా ఆసక్తిగా వెయిట్ చేస్తున్నారు. ఇప్పటికే వారణాసి వీడియో గ్లింప్స్ అదిరిపోయింది. తాజాగా బాలీవుడ్ హీరో రణ్‌బీర్ కపూర్ నటిస్తున్న 'రామాయణ' సినిమా టీజర్ రిలీజ్ చేశారు. ఇది చూసిన తర్వాత.. వారణాసి రాముడి లుక్ రివీల్ అయితే మాత్రం.. ఇలా ఉండదని అర్థమవుతోంది. రాముడిగా రణ్‌బీర్ కపూర్ లుక్ బాగున్నప్పటికీ.. రాజమౌళి రాముడు ఎలా ఉంటాడా అన్న ఆసక్తి మాత్రం పెరుగతోంది.

# రామాయణ టీజర్ విడుదల

రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో నితీశ్ తివారీ దర్శకత్వంలో రానున్న సినిమా 'రామాయణ' ఇప్పుడు ఆసక్తి రేకెత్తిస్తోంది. హనుమాన్ జయంతి సందర్భంగా ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేశారు. రాముడి పాత్రలో రణ్‌బీర్ ఆకట్టుకుంటున్నారు. వీఎఫ్ఎక్స్ ఈ టీజర్‌కు హైలైట్‌గా నిలిచాయి. సుమారు రూ.4000కోట్లతో ఈ ప్రాజెక్ట్ రూపొందుతోంది. మొదటి భాగం దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రభాస్ ఆదిపురుష్ అంతగా ఆకట్టుకోలేక పోయిన తరవాత వస్తున్న ఈ సినిమాపై భారీగా అంచనాలు ఉన్నాయి. సీతగా సాయిపల్లవి నటిస్తుండగా, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. 'రామాయణ' ప్రాజెక్ట్‌లో భాగం కావడంపై నటుడు రణ్‌బీర్ కపూర్ మీడియా మీట్‌లో మాట్లాడారు. ఇలాంటి అద్భుతమైన చిత్రాల్లో నటించాలని తాను అనుకున్నానని.. తన కల నెరవేరిందన్నారు. 2000లో విజువల్ ఆర్ట్స్‌కు సంబంధించి విదేశాల్లో శిక్షణ తీసుకున్నా. ఓసారి నా మిత్రుడు.. నువ్వు ఏం కావాలనుకుంటున్నావు? అమెరికాలోనే స్థిరపడి వర్క్ చేయాలనుకుంటున్నావా? అని అడిగాడు. మా సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే సినిమాతో అమెరికా వస్తా అని బదులిచ్చా. ఈ సినిమాతో నా కల నెరవేరిందని రణ్‌బీర్ అన్నారు. ఇందులో నటించేందుకు మొదట తాను ఆసక్తి చూపించలేదన్నారు. తండ్రి అయ్యాక తన ఆలోచనా విధానంలో మార్పు వచ్చిందన్నారు. భయాన్ని వదిలి ధైర్యంగా ఈ సినిమాలో నటించేందుకు ముందుకొచ్చానని తెలిపారు. దీపావళి కానుకగా 'రామాయణ' తొలి భాగం ప్రేక్షకుల ముందుకురానుంది.







# ఏడేళ్ల కల సాకారం కాబోతోంది

## రామాయణ దర్శకుడు నితీశ్ తివారీ



బాలీవుడ్ నటుడు రణ్‌బీర్ కపూర్, దర్శకుడు నితీశ్ తివారీ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న భారీ చిత్రం 'రామాయణ' సినిమాకు సంబంధించిన ఒక ప్రత్యేక వీడియోను గురువారం చిత్రబృందం విడుదల చేసింది. రాముడి పాత్రలో రణ్‌బీర్ లుక్ ఎలా ఉంటుందనేది ఈ వీడియోతో తెలియజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో దర్శకుడు నితీశ్ తివారీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ క్షణం కోసం తాను ఏడేళ్లుగా ఎదురుచూస్తున్నానని చెప్పారు. రామాయణ' కోసం సుమారు ఏడు సంవత్సరాల నుంచి వర్క్ చేస్తున్నా. చిత్రీకరణ ఎన్నో సవాళ్లతో కూడుకున్నది. కాకపోతే, గత ఏడేళ్లలో ప్రతిక్షణం నాకు గుర్తుకొచ్చింది ప్రేక్షకులు మాత్రమే. ప్రేక్షకుల రియాక్షన్ ఎలా ఉంటుందా? అని ఎదురుచూస్తూ సమయాన్ని గడిపా. ఈరోజు మీ అందరి రియాక్షన్ చూసిన తర్వాత నా ఎదురుచూపులకు తగిన ప్రతిఫలం దక్కిందని నితీశ్ తివారీ అన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్ కోసం ప్రపంచవ్యాప్తంగా 10,000 మంది వర్క్ చేస్తున్నారని టీమ్ ప్రకటించింది.




సినిమా ఇండస్ట్రీలో కొన్ని కాంబినేషన్లు చరిత్ర సృష్టిస్తాయి. మరికొన్ని కాంబినేషన్లు వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతాయి. సరిగ్గా ఇలాంటి చర్చకే ఇప్పుడు తెరలేపింది నటి ఆండ్రియా జెర్మియా సింగర్‌గా కెరీర్ మొదలుపెట్టి, తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ, రీసెంట్‌గా చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా తన కెరీర్‌ను మలుపు తిప్పిన యుగానికి ఒక్కడు (బస్త్రుఅఱఎఱ ూఎఱుఎబ) సినిమా సీక్వెల్ గురించి ఆమె మాట్లాడిన మాటలు వింటే ఎవరైనా షాక్ అవ్వాల్సిందే..! నిజానికి యుగానికి ఒక్కడు అనేది ఒక సినిమా మాత్రమే కాదు.. అదొక అడ్వెంచర్. ఈ చిత్రం విషయంలో దర్శకుడు సెల్వరాఘవన్ (ూవశ్రీఖుతీఖుస్త్రష్ఖుఖుఅ ) విజన్ ఎలా ఉంటుందో అందరికీ నిరూపించాడు. ఒక విధంగా అది ఒక అద్భుతం అని చెప్పాలి. కానీ ఆ అద్భుతం వెనుక నటీనటులు పడ్డ కష్టం అంతా ఇంతా కాదు. సుమారు 200 రోజులకు పైగా షూటింగ్.. అదీ అడవుల్లో, ఎడారుల్లో అత్యంత క్లిష్టమైన పరిస్థితుల మధ్య చిత్రీకరణ సాగింది. ఈ సినిమా తమిళం కంటే తెలుగులోనే భారీ బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. కార్తీ కి తెలుగులో ఒక మార్కెట్ ఏర్పడడానికి ఈ సినిమానే పునాది వేసింది.



**ఆ దర్శకుడు ముప్పు తిప్పలు పెట్టాడు.. జన్మలో అతనితో సినిమా చేయను**

# రణబాలిలో ఇంటెన్స్ లుక్‌లో విజయ్

విజయ్ దేవరకొండ హీరోగా, రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ పీరియడ్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ అనంతపురంలో శరవేగంగా జరుగుతోంది. అయితే, తాజాగా ఈ షూటింగ్ స్పాట్ నుండి ఒక వీడియో లీక్ అయింది. ఇందులో విజయ్ దేవరకొండ మునుపెన్నడూ చూడని విధంగా చాలా ఇంటెన్స్ లుక్‌లో కనిపిస్తున్నాడు. లీకైన ఫుటేజీలో విజయ్ ఉగ్రరూపంతో కనిపిస్తున్నాడు. ముఖ్యంగా ఆయన డైలాగ్ డెలివరీ వాయిస్ మోడ్యులేషన్ పీక్స్‌లో ఉందనే చెప్పాలి. ఊర మాస్ డైలాగులు థియేటర్లలో విజిల్స్ వేయించడం ఖాయమనిపిస్తోంది. ఈ లీక్డ్ వీడియో చూస్తుంటే.. పవర్ ఫుల్ యాక్షన్స్ సీక్వెన్స్ తెరకెక్కిస్తున్నట్టుగా అనిపిస్తోంది. ఈ సినిమాలో విజయ్ బాడీ లాంగ్వేజ్, ఆ యాస ఆయన కెరీర్‌లోనే అత్యుత్తమంగా నిలుస్తాయని ఫ్యాన్స్ భావిస్తున్నారు. 'ట్యాక్సీవాలా' తర్వాత విజయ్-రాహుల్ సంకృత్యన్ కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా ఇది. పైగా ఇందులో రష్మిక మందన్న కథానాయికగా నటిస్తుండటంతో అంచనాలు ఆకాశాన్నంటాయి. అయితే, లీకైన వీడియో చూసి ఫ్యాన్స్ ఖుషీ అవుతున్నప్పటికీ, చిత్ర బృందం మాత్రం ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఈ మధ్య వస్తున్న సినిమాలన్నీ కూడా ఇలాంటి లీకుల బారిన పడుతున్నాయి. మేకర్స్ ఎన్ని జాగ్రత్తలు తీసుకున్న లీకుల బెడద తప్పడం లేదు. కానీ, రణబాలి లీక్ మాత్రం.. ఈసారి రౌడీ హీరో రష్మికతో కలిసి బి÷-గగెస్ట్ బ్లాక్‌బస్టర్‌ను కొట్టడం ఖాయమని అభిమానులు భావిస్తున్నారు.




Owned and Published by Sirigiri Varadaraju, RNI No: APTEL/2018/76747, Dr. Narsimlu Yellampally - Bureau Chief, Telangana, 9618907705, email: navataramtelugudaily@gmail.com, Telangana State Corporate Office: Plot No. A/9, Phase -1, Alwyn Colony, Kukatpally, Hyderabad - 72, Telangana, India. website: https://navatharam.com